ఉద్యోగాన్వేషణలో ఎక్కే గడప దిగే గడపగా తిరుగుతున్న చలపతి అలసిపోయాడు అంత కంటే విసిగిపోయాడు. విసిగిన ప్రాణం విరక్తిని కలిగిస్తుంటే వెనుకనున్న బాధ్యత వెన్ను తడుతోంది.

ఆశలు నిండిన కళ్ళలో నిరాశ చోటుచేసుకోగా తన రూముకు చేరుకున్నాడు చలపతి. గది తలుపు తెరుస్తూ ఎదురుగా కనిపించిన కవర్ని ఉద్వేగమైన మనసుతో తెరిచి చూశాడు.

''రాబోయే గురువారం పదకొండు గంటలకు దేశీ కెమికల్స్ కంపెనీలో కెమిస్ట్ పోస్టుకు ఇంటర్వ్యూకు రమ్మని'' దాని సారాంశం.

చలపతి కళ్ళు ఒక్కసారిగా వెలుగును పులుముకున్నాయి. కాని ఆ వెలుగు ఎంతో సమయం నిలువలేదు. ''తమ ఇంతకుముందు ఎన్ని ఇంటర్వ్యూలకు వెళ్ళిరాలేదు. కాని ఉద్యోగం సంపాదించలేకపోయాడు తన 'ఇనెఫిషెన్సి'వల్లనా? కానేకాదు. యం.యస్.సిలో డిస్టింక్షన్‌లో పాసయిన తను ప్రతి ఇంటర్వ్యూ ఎంతో బాగా చేశాడు. ఫలితం తన కంటె ఏ మాత్రం బాగా చేయని అనామకులను ఎంచుకున్నారు. అంత కంటే వారు సమర్పించిన ఉత్తర దక్షిణాలకు దాసోహమన్నా రంటే బాగుంటుంది.

తనకు రెండూ లేవు. ఉన్నదల్లా కాలే కడుపు, మండే గుండెలు. వీటికితోడు ఇప్పుడిప్పుడే లోకాన్ని చదవగలుగుతున్న కళ్ళు. ఇప్పుడు ఈ ఉద్యోగం మాత్రం వస్తుందని నమ్మకమేమిటి ? రాదు. జరుగుతున్నదంతా నాటకం. జరగవలసిన దంతా జరిగిపోయిన తరువాత ఆడే బూటకం. ఈ ఇంటర్వ్యూలు తనబోటి వాళ్ళను అపహాస్యం పాలు చేయటానికేనా ! ఏమో ? ఇదే అక్షరాల జరుగుతున్నది. తానీ హింసను భరించలేడు. వారి అపహాస్యాన్ని తానిక ఎంతోకాలం సహించలేడు. ఏదో ఒకటి చెయ్యాలి'' నిర్ణయించుకున్నాడు చలపతి.

చలపతి మనసు ఈ నిర్ణయంతో ఎంతో తేలిక పడింది.

వర్షం కురిసి వెలిసిన తరువాత ఏర్పడే ప్రశాంతత అది.

''చలపతీ ! ఏమిటలా కూర్చుండిపోయావు బట్టలయినా మార్చుకోకుండా. చేతిలో ఆ వుత్తరం ఏమిటి ?'' అప్పుడే వచ్చిన సారథి పలకరింపుతో ఈ లోకానికి వచ్చాడు చలపతి.

చలపతి, సారథి స్నేహితులు. ఇద్దరూ రూమ్ మేట్సు. సారథి చదువులో అంత ఉత్సాహం కనబరచకపోవటంతో ఐ. టి. ఐ.తో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. 'టెక్నికల్' కావటంవల్ల త్వరగా ఉద్యోగం రావటం, సెటిలయిపోవటం జరిగింది. స్వతహాగా సారథి ఉన్నవాడు కావటంతో తన బాల్యస్నేహితుణ్ణి తన రూములో వుండిపొమ్మనటం జరిగింది.

''ఇంటర్వ్యూ కాల్ లెటర్ వస్తే చూస్తున్నాను'' అంటూ చేతిలోని ఉత్తరాన్ని సారథికి అందించాడు చలపతి.

* * *

ఆరోజు గురువారం, అనుకున్న రోజు రానే వచ్చింది

''చలపతీ ! నేను ఆఫీసుకు వెళుతున్నాను. ఇంటర్వ్యూ బాగా చేస్తావని ఆశిస్తాను. సాయంత్రం నేను హోటల్ స్వరాజ్ దగ్గరకు ఐదు గంటలకల్లా వస్తాను. నీవు కూడ అక్కడకు వస్తే అటునుంచి అటు ఇద్దరం కలసి పిక్చర్‌కు వెళదాం'' కార్యక్రమాన్ని వివరించాడు సారథి

''లేదు ఈరోజు పిక్చర్‌కు నేను రాలేను. నువ్వు వెళ్ళిరా.''

''చూడు చలపతీ, నిన్ను విడిచి ఈ సంవత్సర కాలంలో నేను పిక్చర్‌కు వెళ్ళానా? అలా జరగదు. నీవు కాదనకు. ఇద్దరికి రిలీఫ్ కావాలి. తప్పకుండా సాయంత్రం కలుస్తావు కదూ ? నీ కోసం ఎదురు చూస్తూవుంటాను'' అంటూ హెచ్చరించి వెళ్ళిపోయాడు సారథి.

సారథి అభ్యర్థనను కాదనలేని చలపతికి మౌనంగా వుండిపోవటం తప్పలేదు.

ఇంటర్వ్యూకు బయలుదేరిన చలపతి కళ్ళలో ఇదివరకటి ఆతృత, ఉత్సాహం మచ్చుకైనా లేదు. భవిష్యత్కాలాన్ని తెలుసుకున్న జ్ఞానిలా నిర్వికారంగా ముందుకు కదిలాడు

"ఎలా చేశావు ఇంటర్వ్యూ?" అడిగాడు సారథి స్వరాజ్ హోటల్ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్న చలపతిని.

"అందరూ తెల్లమొహం వేసేలా చేశాను."

"అంటే!?"

"ఏముంది. వారడిగిన ప్రతిదానికి అంతు పట్టని జవాబులిస్తూ వారిని పూర్తిగా బ్లఫ్ చేశాను."

"చలపతీ! ఎందుకలా చేశావు? నీకు పిచ్చి పట్టలేదుకదా?"

"ఇంతకాలం వారడిగిన ప్రతిదానికి వినమ్రతతో సమాధానాలిస్తూ, ఉద్యోగం ఇస్తారనే ఆశతో, నా చదువుమీద నమ్మకంతో, యూనివర్సిటీ వాళ్ళిచ్చిన యీ సర్టిఫికేట్స్‌నే నా జీవితంగా భావిస్తూ బ్రతికాను. కాని ఇప్పటివరకు జరిగిం దేమిటి? ప్రతిసారి ఇంటర్వ్యూ బాగా చేసినందుకు మెచ్చుకున్నారు. నాకే ఉద్యోగమిస్తున్నట్లు మాట్లాడారు తీరా ఏ అనర్హుడికో ఉద్యోగమిస్తూ వచ్చారు. అది వారి తప్పుకాదా? అలా చేసింది వారికి పిచ్చి పట్టేనా??

ఉత్తర, దక్షిణాలకు దాసోహమంటూ అర్హత గలిగిన నన్ను నిలువునా పాతాళానికి అణచివేశారు. ఇది వారి హక్కంటావా? నామీదే ఆశలు పెంచుకుని నాన్న లేకపోయినా పెంచిపెద్ద చేసి చదివించిన 'అమ్మ' సుకృతమంటావా? నాన్నంటే ఎవరో తెలియని చెల్లి, తమ్ముడు నామీదే తమ భవిష్యత్తును నిలుపుకొని ఎదురు చూడటం వాళ్ళు చేసిన నేరమంటావా? ఇదంతా కావాలని చేస్తున్నది కాదా! ఏది ముట్ట చెప్పలేని నేను ఉద్యోగం సంపాదించటం అసంభవం" ఉద్రేకంగా తన బాధను, వ్యతిరేకతను వ్యక్తపరిచాడు చలపతి

"కావచ్చు. అంతమాత్రాన ప్రతి ఒక్కటి అలాగే జరుగుతుందనుకోవటం తెలివైన పనికాదు. సంఘంలో ఎన్నో రకాల మనుషులు, మనస్తత్వాలు వున్న తరువాత మంచికితోడు చెడు వుండక తప్పదు. అయినంత మాత్రాన ప్రతి ఒక్కటి చెడు అనుకోవటం సబబుకాదు."

"ఇవన్నీ మాటలద్వారా మనం చెప్పుకోవటానికి పనికివచ్చే స్వాంతన వచనాలు మాత్రమే. కాలేకడుపుకు ఇంత గంజి పోయలేని ఈ సంఘాన్ని వెనకేసుకు రావటం అసంగతం" అన్నాడు తన వాదనను సమర్థిస్తూ చలపతి.

"సరే, అయిందేదో అయింది. జరిగిన దాన్ని మర్చిపో. నీకు కల్గిన ఈ అభిప్రాయం తప్పని ఒక నాటికి తెలుసుకోకపోవు" సినిమా టయిము దగ్గర పడటంతో బిల్లు చెల్లించి లేచాడు సారథి.

* * *

"చలపతీ! గుడ్ న్యూస్" చలపతి బజారు నుంచి వస్తుండగా గుమ్మంలోకి ఎదురు వెళ్ళాడు సారథి.

"ఏమిటో అంత మంచివార్త. బహుశ అమ్మదగ్గర నుంచి ఉత్తరం వచ్చి వుండవచ్చు" వెనుకకు వడచి పట్టుకున్న సారథి చేతుల వంక చూస్తూ అన్నాడు చలపతి.

"లేదోయ్, ఇప్పటికైనా నీ అభిప్రాయం తప్పని ఒప్పుకోవలసిన సాక్ష్యాధారం."

"అంత నా అభిప్రాయం తప్పని ఒప్పుకో వలసి ఏమొచ్చిందో ఇప్పుడు?"

"ఎప్పాయింట్‌మెంట్ ఆర్డరు" కాగితాన్ని చలపతి కందిస్తూ అన్నాడు సారథి.

చలపతి తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు క్షణకాలం. ఆలోచించిన కొద్ది అంతుపట్టని ఆలోచనలతో బుర్ర వేడెక్కింది.

ఆరోజు చలపతి జాబ్‌లో జాయిన్ అవ్వాలసి రోజు. కాని అతని మనసు ఏదో తెలియని భయంతో నిండిపోయింది. అసలు ఈ జాబ్ తనకు ఎలా వచ్చింది? అన్నదే అతనికి తెగని సమస్య. ఆఫీసుకు వెళ్ళిన చలపతి మధ్యాహ్నానికి జాయినింగ్ రిపోర్టు, ఆఫీసుకు సంబంధించిన మిగతా కాగితాలు పూర్తి చేసి యివ్వటం జరిగింది.

తన సీటులో కూర్చొని ఆఫీసు కాగితాలు, లాబ్ రిపోర్ట్సు కొలీగ్ సహాయంతో తనిఖీ చేస్తున్న చలపతికి బాస్ దగ్గరనుంచి పిలుపు వచ్చింది. ఇంత త్వరలో బాస్‌కు తనతో ఏమి పని పడిందో అర్థం కాని చలపతి ఆలోచిస్తూ క్యాబిన్‌లోనికి వెళ్ళాడు

"యస్. మిస్టర్ చలపతి. టేక్ యువర్ సీట్" అన్నారు బాస్ ఎదురుగావున్న కుర్చీని చూపిస్తూ.

"థాంక్యూ సర్" అంటూ బితుకు బితుకుగా బాస్ చూపించిన కుర్చీలో కూర్చొన్నాడు చలపతి.

"మిస్టర్ చలపతీ! చార్జి తీసుకున్నారను కుంటాను. మీకు తెలియని విషయాలు చీఫ్ కెమిస్ట్‌గారితో సంప్రదించండి. మొదట కొత్తగా ఫీలవటం సర్వసహజం. ఇక ముందు మీరు బాధ్యత గల వ్యక్తి అనే విషయాన్ని మీరు మరువకూడదు" అన్నారు బాస్ కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ.

'ఓ. కె. సార్!" అన్నాడు చలపతి సాధ్యమైనంత అణకువగా.

బాస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ "చూడు చలపతి, ఇంత చిన్న వయసులో సంఘంమీద ద్వేషం పెంచుకోవటం నీకే మంచిది కాదు. నిరుద్యోగ సమస్య దేశాన్ని పట్టిపీడిస్తున్నదనటం నిర్వివాదాంశం. కాని నీబోటి యువతరం సహనాన్ని కోల్పోయి సంఘాన్ని ద్వేషించటం తెలివిగల పని కాదు. నువ్వు ఇంతటి వాడివయింది ఈ సంఘం సహకారం వల్లనే అనే విషయాన్ని మరువకూడదు. ఈరోజున అభివృద్ధి చెందిన దేశాలలో కూడ నిరుద్యోగ సమస్య విలయతాండవం చేయటం నీకు తెలియంది కాదు. ఇంతెందుకు, ఇప్పుడు ఉద్యోగం చేస్తున్నవారు కూడ ఎన్నో నష్టకష్టాలకు గురి కాకుండ ఉద్యోగం సంపాదించలేదు అన్న విషయం నీవు గుర్తించాలి. ఈ రోజున యువకుల్లో లోపించిన ఓర్పువల్ల ఈ సమాజంలోవారు 'కలుపు మొక్కలై' నిలువకూడదు.

ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందో, ఈ ఉద్యోగం నీకు ఎలా వచ్చిందా అనే విషయాలు నీకు క్యూరియాసిటీని కలిగించవచ్చు. నీవు హోటల్ 'స్వరాజ్'లో నీ మిత్రునితో చెప్పిన నీ భావాలు, నిరుద్యోగ కారణంగా నీలో ఏర్పడిన నైరాశ్యత, నీ బాధ్యతలు ఆ సమయంలో మీ ప్రక్క టేబుల్ వద్ద కూర్చున్న నేను వినటం జరిగింది. యువకులలో మనస్థైర్యాన్ని, మంచిని పెంచాలను కునే నేను ఈ ఉద్యోగానికి కావలసిన అర్హతలు నీకున్నాయని నీ అప్లికేషన్ ద్వారా తెలుసుకొని దీనిని నీకు ఇవ్వటం జరిగింది. ఇకముందు నీ మనో చాంచల్యాన్ని విడనాడి ఒక చక్కటి బాధ్యత గల ఆఫీసరుగా రూపు దిద్దుకోవాలనేదే నా ఆకాంక్ష" అన్నారు బాస్ తను చెప్పదలచుకొన్నది — ముగిసిం దన్నట్లుగా.

అంతవరకు అవాక్కయి వింటూ తన పొరపాటును తెలుసుకున్న చలపతి మనసులో "బాస్" ఎంతో ఉన్నతుడుగా ఎదిగిపోయాడు.

"థాంక్యూ ఫర్ యువర్ కైండ్‌నెస్ సార్!" అన్నాడు ఉద్వేగమైన మనసును అదుపు చేసుకుంటూ, అంతకంటే తన కృతజ్ఞతను ఎలా తెలియజేయాలో తెలియని చలపతి.

## మనోహర్మ్యం

మనోహర్మ్యంలో మందిరాలనేకం
కొన్ని అలంకార సుశోభితాలు
కొన్ని ధూళి ధూసరితాలు
కొన్ని కస్తూరి కాగరు పరిమళ భరితాలు
కొన్ని దుస్సహ దుర్గంధ భూయిష్టాలు
కొన్ని మునిశాలాలు
కొన్ని అత్యంత సంకుచితాలు

రమ్యమైన వాకిళ్ళు
అరణ్యాల్లాంటి లోగిళ్ళు
జీబూతాల్లాంటి ముంగిళ్ళు
పెనుభూతాల్లాంటి పెరళ్ళు
ఇల్లంతా యధేచ్ఛగా
కలయ దిరగ వచ్చు
కాని ...
ఏదో ఒక గదిలో ...
ఎదలో శూలానికి మూలమో
మదిలో మచ్చకు అద్దమో
గుప్తాగారంలో అస్థిపంజరమో
సుప్త భుజంగమో
సాకారమో నిరాకారమో
ఒక భయంకర రక్షశక్తి
దాగివున్నది జాగ్రత్త!
ఆ గది గుర్తించుకో
ఆ తలుపులు తెరువకు

పి. జె. రామారావు